1. [1]కవులు లాభ [2]మరసి చేయు - కపట మంత్రముల్ = విధులు - [3]దవులఁ బోవఁ దరిమి యేసు - [4]తత్వముఁగొనువారికన్న ॥నెవరు॥

2. దీనమానసుల కిట్టి [5]యుప - దేశ మిచ్చెను = దివ్య - మైన మోక్ష రాజ్యము వారి దౌనటంచు - ప్రభువు తెల్పె ॥నెవరు॥

3. [6]వృజినములకై దుఃఖించెడి - సుజను లెవ్వరో = వారు - నిజముగ నోదార్పుఁ బొంది నిత్య [7]సంతోషితు లని తెల్పె ॥నెవరు॥

4. శాంతి నీతికరుణల యందా - సక్తిగల వారు = భూస్వతంత్రులై పరి తృప్తినొంది - దయఁ బడసెద రని ప్రభువు తెల్పె ॥నెవరు॥

5. పరిశుద్ధ హృదయులు [8]పరా - త్పరునిఁ జూతురు = సర్వ - నరుల సమాధానపరచు - నరులె పరమ జనకుని సుతులు ॥నెవరు॥

6. నీతికొర కాపద నొందెడి - నిశ్చ లాత్ములు = వారు - [9]ఖ్యాతిగఁ బర లోక రాజ్య - ఘన సౌఖ్యము లెల్లను [10]బడయుదురు ॥ఎవరు॥

- పురుషోత్తము చౌధరి

## 155 క్రీస్తు వాక్యము పతితపావనము

రా - శంకరాభరణము (చాయ: మన మొదటి తలిదండ్రుల్, తా - త్రిపుట

వినరయ్య నరులారా - విశ్వాసమున క్రీస్తు - విమల బోధ = పాప మనుజుల కెల్ల పా - వన జీవనము సేయు - వసుధ మీఁద ॥వినరయ్య॥

1. పాపాత్ములను పశ్చా - త్తాపము పడుఁడంచు - బ్రభువు దెల్పెన్ = దన - దాపు గోరినవారిఁ - గాపాడుటకుఁ దానే [11]దక్షుడయ్యెన్ ॥వినరయ్య॥

2. భారాక్రాంతులైన - పాపులఁ - దనుఁ జేరఁ - బ్రభువు పిల్చెన్ = శ్రమలు - దూరంబుఁ జేసిత - ద్దురితముల్ బాపి సం - తోష మియ్యన్ ॥వినరయ్య॥

3. అనుమానింపక నెవ్వ - రైన వచ్చినఁ ద్రోయ - ననుచుఁ బల్కెన్ = పెక్కు - మనుజుల కొఱకు జీ - వన మియ్యనే వచ్చి - తనుచుఁ దెల్పెన్ ॥వినరయ్య॥

---

[1]కవిత్వము చెప్పువారు. [2]విచారించి. [3]దూరముగ. [4]వాస్తవము. [5]బోధ. [6]పాపములకై. [7]సంతోషింప చేయబడువారు. [8]దేవుని. [9]ప్రసిద్ధిగా. [10]పొందుదురు. [11]సమర్థు.



4. మనసారదేవునిన్ - మానక ప్రేమింపు - మనుచునేర్పెన్ = ఇంకఁ దన పోల్కె - నొరులను దాను బ్రేమింపగ దనర దెల్పెన్ ॥వినరయ్య॥

5. తన శిష్యులకు నైక్య - మును ప్రేమించుట కాజ్ఞ - లొసర నిచ్చె = నెంతో - ఘన సత్ప్రభువు కాళ్లు - గడిగి భక్తులచోట - వినతుఁ డయ్యెన్ ॥వినరయ్య॥

- పురుషోత్తము చౌధరి

## 156 క్రీస్తు తుఫానును నిమ్మళపర్చుట

రా - ముఖారి తా - త్రిపుట

ఏలాటివాఁడో కాని - యీ యేసుని - నేమని వివరింతుము = గాలివాన యేసుని - గద్దింపునకుఁ చాల భయపడి నిలిచెను ॥ఏలాటి॥

1. ముద్దు శిష్యులతోడను - సముద్రపు - టద్దరికి వెళ్లెను = కొద్ది పడవనెక్కెను = ఇంతలోనె - పెద్దగాలి రేగెను ॥ఏలాటి॥

2. అల్లకల్లోలముగా - సముద్రము - అల్లలాడు నప్పుడు = చల్లఁగ దోనె వెనుక - తలగడపైని - మెల్లన నిదువోయెన్ ॥ఏలాటి॥

3. చింత లేదా యేమయ్యా - బోధకుఁడా న - శించిపోవుచున్నాము = ఎంతో వేదన పడితిమి - కాపాడుమ - టంచు శిష్యులు లేపిరి ॥ఏలాటి॥

4. దిగ్గునఁ బ్రభువు లేచి - యా గాలిని - గద్దించిన వెంటనే = తగ్గి నిమ్మళించెను - సమస్తము - సద్దు ఉడిగిపోయెను ॥ఏలాటి॥

5. ఏల భీతు లైతిరి - యింతలోనే - యెంత నమ్మిక లేదని = యీలాగు నోదార్చెను - యేసు తన - సొంత శిష్యుల నప్పుడు ॥ఏలాటి॥

- తూసిలి బెంజిమిన్

## 157 వ్యాధి బాధితురాలిని స్వస్థపర్చుట

రా - ఆనందభైరవి (చాయ: దేవుని ప్రేమ యిదిగో) తా - కురురుఝంపె

యేసు వస్త్రపు చెంగును - మాత్రమే - యాసించి ముట్టినట్టి = దోసకారుల రోగముల్ - వెంటనే - తొలఁగి పోయెను నిజముగ ॥యేసు॥